ప్రజాశక్తి

శుక్రవారం 21 జులై 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పేదల భూములపై

మైనింగ్ వ్యాపారుల కన్ను

◆ స్థలాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయని ప్రభుత్వం ◆ దీన్నే అలుసుగా తీసుకుంటున్న వ్యాపారులు
◆ భూమి మీదికాదని బెదిరింపులు ◆ భయపడుతున్న పట్టాదారులు ◆ అందని పిఎంకెఎస్‌వై నిధులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, కొత్తకోట విలేకరి

అక్కడ గిరిజనులు, దళితులు, పేదలకు ఇచ్చిన డి పట్టా భూములపై మైనింగ్ వ్యాపారుల కన్ను పడింది. విలువైన భూములను స్వాధీనం చేసుకోవడానికి పావులు కదుపుతున్నారు. పట్టా భూముల్లో సాగులోవున్న వారిని వెళ్లగొట్టి తమ స్వాధీనంలోకి తెచ్చుకోవాలని కొంతకాలంగా ప్రయత్ని స్తున్నారు. వెబ్‌ల్యాండ్‌లో భూములు నమోదుకాకపోవడం వల్ల మైనింగ్ వ్యాపారుల నుంచి భయం ఒకవైపు వెంటాడుతుంటే, మరోవైపు ప్రభుత్వం నుంచి రావాల్సిన పిఎంకెఎస్‌వై నిధులు, బ్యాంకు నుంచి పంట రుణాలు అందక లబ్ధిదారులు అంతులేని వేదన అనుభవిస్తున్నారు. అసలింతకీ జిల్లాలోని ఉర్లోవలో ఏం జరుగుతోందంటే..



ఉర్లోవ రెవెన్యూలోని పేదల పట్టా భూములు

జిల్లాలోని వి.మాడుగుల మండలం, ఉర్లోవ సర్వే నెంబర్ 16 నుంచి 54 మధ్య రావికమతం మండలం కొమిరి, మత్స్యపురం, బుడ్డిబందల్లోని గిరిజనులు, దళితులు, పేదలకు ప్రభుత్వం డి పట్టాలు మంజూరుచేసింది. భూములు అప్పగించింది. ఈ డి పట్టా భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయకపోవడంతో ప్రభుత్వపరమైన ఆర్థిక సాయం కొన్నిసార్లు పొందలేకపోతున్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా కింద పొందాల్సిన రూ.13,500ల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏటా చెల్లిస్తున్న రూ.7,500 పట్టాదారుల ఖాతాలో జమవుతున్నా, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పిఎం కిసాన్ నిధులు ఆరు వేల రూపాయలు మాత్రం రావడంలేదు. వెబ్‌ల్యాండ్‌లో లబ్ధిదారుల పేర్లు, భూముల వివరాలు నమోదు చేయకపోవడంతో పిఎం కిసాన్ నిధులు, బ్యాంకు రుణాలు మిగతా 2లో..



దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

అదానీ గంగవరం పోర్టులో

అంతులేని శ్రమ దోపిడీ

వార్త మెయిన్‌లో..

నేటి నుంచి ఓటరు సర్వే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలూ సహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. గురువారం ఉదయం గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని తమ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకూ బిఎల్‌ఓల ద్వారా ఇంటింటి ఓటరు సర్వే చేపడుతున్నామన్నారు. ఎన్నికల నామినేషన్లకు మిగతా 2లో..

విశాఖపై సిఎం ప్రత్యేక దృష్టి

▶ వార్త 2లో..

మండలాల్లో విఆర్‌ఎల ధర్నాలు

▶ వార్త 5లో..

'మణిపూర్' నిందితులను కఠినంగా శిక్షించాలి

▶ వార్త 2లో..

వైసిపి జిల్లా అధ్యక్షునిగా గురువులు



కోలా గురువులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి జిల్లా అధ్యక్షునిగా కోలా గురువులు నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందాయి. మొన్నటి వరకూ జిల్లా అధ్యక్షునిగా పనిచేసి ఇటీవల ఆ పదవికి, వైసిపి సభ్యత్వానికి పంచకర్ల రమేష్‌బాబు రాజీనామా చేసి జనసేనలో చేరిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న అధికార పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి కాసింత పోటీ నెలకొన్నా చివరకు గురువులువైపే అధిష్టానం మొగ్గుచూపింది. ఇదిలా ఉండగా గురువులు ఇటీవలే డిసిసిబి ఛైర్మన్‌గా నియమితుల య్యారు. అయన గతంలో విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం ఒక ఓటు తేడాతో ఓటమి చెందిన విషయం తెలిసిందే.

రూ.27 లక్షల విలువైన విదేశీ సిగరెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపంలో ఐటిసి నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సిగరెట్లను పెద్ద మొత్తంలో నిల్వచేసి అమ్మకాలు చేస్తున్నారనే సమాచారంతో గురువారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. జపాన్ ప్లాజా, సింగపూర్ ప్లాజాలతో పాటు వెంకటేశ్వర, శ్రీనివాస జనరల్ స్టోర్స్‌లకు చెందిన గొడౌన్లపై విజిలెన్స్ ఎస్‌పి స్వరూప రాణి, సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 51 విదేశీ సిగరెట్ బాక్సులు గుర్తించి సీజ్ చేశారు. వీటిలో ఉన్న సిగరెట్ల విలువ రూ.27 లక్షల వరకు ఉంటుందని స్వరూపరాణి మీడియాకు తెలిపారు.

సమస్యలపై మున్సిపల్ కార్మికుల ఆందోళన

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నిరసనలు

తమ సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలోనే గురువారం విశాఖ జిల్లాలో నిరాహార దీక్షలు, అనకాపల్లి జిల్లాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారికి సిఐటియు మద్దతు తెలిపింది.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్. : మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల డిమాండ్ల సాధన కోసం జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమయ్యాయి. దీక్షల్లో కూర్చున్న వాళ్ళందరికీ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కుమార్ మాట్లాడుతూ పాదయాత్ర సమయంలోనూ, అసెంబ్లీ సమావేశంలోనూ మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చి నాలుగేళ్లు అవుతున్నా నెరవేరలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఏమైందని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ సిబ్బందికి రిస్కు అలవెన్స్ ఇవ్వాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లించాలని, డ్రైవర్లు, మలేరియా, వెటర్నరీ, యుజిడి కార్మికులకు హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.



విశాఖలో మాట్లాడుతున్న కుమార్

దీక్షల్లో యూనియన్ ఉపాధ్యక్షులు శీర రమణ, కార్యదర్శి జె.నాయుడు, నాయకులు ఇ.ఆదినారాయణ, ఎం.ఈశ్వరరావు, పి.అప్పలరాజు, బి.రత్నం, వరలక్ష్మి, వెంకటరావు, అనిల్, శ్రావణ పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లిలోని జివిఎంసి రెండో సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పేదల భూములపై మైనింగ్ వ్యాపారుల కన్ను

పొందలేకపోతున్నట్లు పట్టాదారులు చెబుతున్నారు. కొమిరి, మత్స్యపురం, బుడ్డిబంద పేదలు 222 మందికి 366 ఎకరాల్లో తొమ్మిదేళ్ల క్రితం ప్రభుత్వం డి పట్టాలు మంజూరు చేసి, భూములు అప్పగించింది. గిరిజనులు, దళితులు, పేద సాగులోనున్న భూములపై పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం ఆ భూములను అన్ సెటిల్‌మెంట్ విలేజ్ కింద చెప్పి వెబ్‌ల్యాండ్‌లో నమోదుచేయకుండా తాత్సారం చేస్తోంది. డి పట్టా భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో లేకపోవడంతో పేదలకు ఇచ్చిన పట్టా భూముల్లో మైనింగ్ వ్యాపారులు మైనింగ్ లీజులు పొందుతున్నారు. పట్టాదారులను సాగుభూముల నుంచి వెళ్లగొట్టి, ఆ భూములను తమ స్వాధీనంలోకి తెచ్చుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

వాస్తవానికి ఇక్కడ ఒక్కొక్క లబ్ధిదారునికి కనీసం 90 సెంట్లు నుంచి గరిష్ఠంగా మూడెకరాల వరకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. తుప్పలు, డొంకలు కొట్టుకొని భూమి చదును చేసుకొని జీడి తోటలు పెంచుకొని లబ్ధిదారులు ఫలసాయం పొందుతున్నారు. పేదల పట్టా భూములు వెబ్‌ల్యాండ్‌లో నమోదుకాకపోవడంతో పేదల సాగులోని పట్టా భూములు ఆక్రమిత భూములని మైనింగ్ వ్యాపారులు బెదిరిస్తున్నట్లు పట్టాదారులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. పేదలకు పంపిణీ చేసిన పట్టా భూములపై యాజమాన్య హక్కులు లబ్ధిదారులకు కల్పిస్తూ ప్రభుత్వ భూ రికార్డులన్నింటిలో నమోదు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగానికి వుంది. అయినా అన్ సెటిల్‌మెంట్ విలేజ్ పేరుతో వెబ్‌ల్యాండ్‌లో నమోదుచేసే చొరవ రెవెన్యూ అధికారులు తీసుకోవడంలేదు. పట్టాదారు పాస్‌పుస్తకాలున్నప్పటికీ వెబ్‌ల్యాండ్‌లో పట్టాదారుల పేర్లు నమోదుకాకపోవడంతో నిత్యం భయంతో పేదలు పంటలు సాగుచేస్తున్నారు

ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయాలి : సిపిఎం

. పేదలకు ఇచ్చిన భూములను ప్రభుత్వ రికార్డుల్లో నమోదుచేసి హక్కులు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. మైనింగ్ వ్యాపారుల ప్రయోజనాల కోసం పేదలను భూముల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు మానుకొని లబ్ధిదారుల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదుచేయాలన్నారు.

వెబ్‌ల్యాండ్‌లో నమోదుకు చర్యలు : ఆర్‌డిఒ జయరాం

ఉర్లోవ రెవెన్యూలోని పేదలకు ఇచ్చిన డి పట్టా భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదుకు చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం 'ప్రజాశక్తి'కి తెలిపారు. ప్రతి భూ సమస్యనూ పరిష్కరించనున్నామన్నారు. లబ్ధిదారులందరూ జగనన్న సురక్ష కింద దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారని తెలిపారు.

సమస్యలపై మున్సిపల్ కార్మికుల ఆందోళన



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

మాట్లాడుతూ మున్సిపల్ ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, సత్యనారాయణ, అజయ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు సర్వే

పది రోజుల ముందు వరకు ఓటర్లకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కెయస్.విశ్వనాథన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, పార్టీల ప్రతినిధులు కృష్ణకాంత్ (వైసిపి), పాసర్ల ప్రసాద్ (టిడిపి), విజయానంద రెడ్డి (బిజెపి), సుధాకర్ (కాంగ్రెస్), బోణి కృష్ణ (బిఎస్‌పి), డాక్టర్ సీతల్ మదన్ (ఆమ్ ఆద్మీ) పాల్గొన్నారు.

బహుజనులు పోరాటాలకు సిద్ధంకావాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజ్యాధికారం చేపట్టడానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ బహుజనులు నిబద్ధులు కావాలని సీనియర్ ఐఎఎస్ అధికారి విజయకుమార్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ స్ఫూర్తితో ముందుండి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంఘం నాయకుల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రవీంద్ర భారతిలో అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ద్వారకానగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో గురువారం అక్షరాభ్యాస మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర భారతి పాఠశాలల జోన్ ఇన్‌ఛార్జి వెంకటేష్, అసిస్టెంట్ జోన్ ఇన్‌ఛార్జ్ జగదీష్, జిఎం రమ్య, హైస్కూల్ కో-ఆర్డినేటర్ సుదారత, ప్రైమరీ స్కూల్ కో-ఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపల్ రమాదేవి పాల్గొన్నారు.

ఎయులో 'ఒక్కడే వీరుడు అల్లూరి' అభినందన సభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయు తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'ఒక్కడే వీరుడు అల్లూరి సీతారామరాజు' సినిమా అభినందన సభ గురువారం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ నేటి సమాజంలో ఎటువంటి లాభాపేక్షకూ తావులేకుండా గొప్ప చిత్రాన్ని తీయడం అభినందనీయమన్నారు.

విశాఖపై సిఎం ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి విడదల రజని తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలులో టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాలపై నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా గురువారం గాజువాక, విశాఖ ఉత్తర నియోజకవర్గాల వారీగా అభివృద్ధి, నియోజకవర్గ స్థాయిలో ఉన్న సమస్యలపై సమీక్షించినట్లు వివరించారు. ముఖ్యంగా రెవెన్యూ, జివిఎంసి, నాడు-నేడు, గడపగడపకు మన ప్రభుత్వం, ఇతర అంశాలపై చర్చించామన్నారు. విశాఖలో ఇటీవల నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు పాల్గొని పలు ఎంఒయులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐదు వైద్య కళాశాలలు ప్రపంచ స్థాయి సౌకర్యాలతో త్వరలో ప్రారంభిస్తున్నట్లు స్పష్టం చేశారు. చదువుల కోసం రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు వెళ్లకుండా మన రాష్ట్రంలోనే చదువుకునే విధంగా వీటిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఉంటే ఆ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయనే ఉద్దేశంతో సిఎం ఉన్నారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి రజని

బిఎస్ఎన్ఎల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిఎస్ఎన్ఎల్‌లో పనిచేస్తున్న క్యాజువల్ కాంట్రాక్టు ఉద్యోగులందరికీ బిఎస్ఎన్ఎల్ సంస్థ ద్వారా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్ఎన్ఎల్ పిజిఎంటిడి కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిఐసిహెచ్.వి.సాగర్ మాట్లాడుతూ క్యాజువల్ కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీరందరికీ బిఎస్ఎన్ఎల్ ద్వారా జీతాలు ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్‌కు ప్రభుత్వం చెప్పిన విధంగా జీతాలు చెల్లించాలని కోరారు. బిఎస్ఎన్ఎల్‌కు 4జిని వెంటనే ఇవ్వాలన్నారు. సిసిడబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమూర్తి, అధ్యక్షులు సూర్య ప్రకాష్‌రావు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సురేష్, సరిపల్లి శ్రీను, ప్రేమ్ కుమార్, నాగిరెడ్డి, సింహాచలం, గోవిందరావు పాల్గొన్నారు. అనంతరం డిజిఎం అడ్మిన్‌కు వినతిపత్రం సమర్పించారు.



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

'మణిపూర్' నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి, ఆ పిదప అత్యాచారం చేసినట్లుగా వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, మహిళా విభాగం కన్వీనర్ జి.సూర్యప్రభ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మణిపూర్‌లో అల్లర్లు చెలరేగుతుంటే విశ్వ గురువులమని ప్రగల్భాలు పలికే పెద్దలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కుల, మత, ప్రాంత విద్వేషాలన్నింటిలో మహిళలు బలిపశువులుగా మారుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మూడు మాసాలుగా చెలరేగుతున్న మణిపూర్ హింసను కేంద్రం నిర్లక్ష్యం చేయడం వల్ల సమస్య మరింత జటిలమైందన్నారు.

మహిళల ఆత్మ గౌరవ దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి పాలనలో రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవానికి తీరని హాని జరుగుతోందని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవానికి భంగం కలుగుతున్న నేపథ్యంలో మహిళల ఆత్మగౌరవ దీక్షను శుక్రవారం విజయవాడలో తలపెట్టామన్నారు. ఈ దీక్షకు అన్ని పార్టీల నాయకులను, మహిళలను ఆహ్వానిస్తున్నామన్నారు. అనంతరం దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో సర్వసిద్ధి అనంతలక్ష్మి, గణగళ్ళ సత్య పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎండిఒ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం ఎంపిపి డివిఎస్ఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సభ్యుల సాధారణ సమావేశంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఏకరువు పెట్టారు. ప్రాధాన్యత వారీగా సమస్యలు పరిష్కరించాలని సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆయా శాఖలు, విభాగాల అధికారులను ఆదేశించారు.

తాళ్ళవలస ఎంపిటిసి సభ్యులు కోరాడ రమణ మాట్లాడుతూ, గొల్లల తాళ్ళవలస నుంచి పిహెచ్‌సికి వెళ్లే రోడ్డు గతుకుల మయంగా ఉందని, గర్భిణిలు అవస్థలు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. తాళ్ళవలస గ్రామ పేదలకు దూరంగా ఉన్న ఆనందపురం మండలం మచ్చవానిపాలెంలో ఇళ్ళ స్థలాలు కేటాయించడం వల్ల ఉపయోగం లేదన్నారు. యాతపేటలో రోడ్లు, కాల్వలు నిర్మించాలని కోరారు.

చిప్పాడ టిడిపి ఎంపిటిసి సభ్యులు చుక్క ఈశ్వరమ్మ మాట్లాడుతూ, గ్రామంలో నిర్మించిన ఆర్‌బికె కేంద్రానికి పర్యవేక్షణ లేక అప్పుడప్పుడు మందు బాబులకు నిలయంగా మారిందని వాపోయారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న అధికారిక కార్యక్రమాలకు సచివాలయ అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు. టి.నగరపాలెం ఎంపిటిసి సభ్యులు పల్లా నీలిమ మాట్లాడుతూ, టి.నగరపాలెంలో ఆర్ అండ్ బి రోడ్డు మంజూరై దాదాపు రెండేళ్లు గడిచినా సరే నేటికీ నిర్మాణం పూర్తి కాలేదని వాపోయారు. దాకమర్రి ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు మాట్లాడుతూ, బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. బోడమెట్టపాలెం సర్పంచ్ ముద్దాడ అప్పయ్యమ్మ మాట్లాడుతూ కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రభుత్వ స్థలాల్లో రోడ్లు వేస్తున్నా, చెరువు కప్పేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణరాజుపేట సర్పంచ్ కాద సూర్యనారాయణ మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగ పడేలా రెండు రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

జలజీవన్ మిషన్ పథకం కింద ప్రతి గ్రామంలో ఇంటింటి కుళాయిలు, యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటుచేసి రక్షిత నీరు అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ దుర్గాంబ, ఎఇ, రేఖను ఎమ్మెల్యే ఆదేశించారు. నిర్ణీత గడువులోగా జగనన్న ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ రూరల్ ఎఇ ఎం.హుస్సేన్‌ను ఆదేశించారు. జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, ఎఎంసి ఛైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎఎంసి వైస్ ఛైర్మన్ బోని అప్పలనాయుడు, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎండిఒ పి.వెంకటరమణ, వివిధ శాఖలు, విభాగాల అధికారులు పాల్గొన్నారు

ప్రజాప్రతినిధులు కాని వారు హాజరు..

మండల సమావేశానికి కొంతమంది మహిళా ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌ల స్థానంలో వారి భర్తలు, కుమారులు, బంధువులు, అధికార పార్టీ నాయకులు హాజరు కావడం పట్ల పలువురు విస్మయం వ్యక్తంచేశారు. ఇది ఏ రకమైన సంప్రదాయమో నిర్వాహకులే ఆలోచించాలని పలువురు అభిప్రాయపడ్డారు.

జాతీయ నేతల విగ్రహాలు పున్ణప్రారంభం

మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నెలకొల్పిన పలువురు జాతీయ నేతల విగ్రహాలను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పున్ణప్రారంభించారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెందుర్తి: మండలంలోని చింతల అగ్రహారం గ్రామంలో రైల్వే ట్రాక్ దాటుతుండుగా రైలు ఢీకొని శంకర్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం శంకర్ రైల్వే ట్రాక్ దాటుతున్నాడు. పెందుర్తి వైపు రైలు వస్తున్నా మూగ చెవిటి కారణంగా శంకర్ శబ్దాన్ని గ్రహించలేకపోయాడు. దీంతో రైలు ఢీ కొట్టింది. శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. శంకర్ కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చింతలగ్రహారం లక్ష్మీపురం గ్రామానికి చెందిన శంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని కెజిహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విశాఖ రైల్వే జిఆర్‌పి సిఐ కోటేశ్వరరావు తెలిపారు.

సహకార సంఘాల ద్వారా రుణాలు

ప్రజాశక్తి -పద్మనాభం : సహకార సంఘాల ద్వారా రుణాలు పొందవచ్చని జిల్లా సహకార సంఘం అధికారి ప్రవీణ తెలిపారు. పద్మనాభం గ్రామ సచివాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యాన గ్రామీణ ప్రాంతాల్లో నడుస్తున్న సహకార సంఘాల ద్వారా అన్ని రకాల రుణాలు పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఈ సంఘాల ద్వారా రైతులకు భూమికి సంబంధించిన రుణాలు మాత్రమే ఇవ్వడం వల్ల వీటి నిర్వహణ కష్టమవుతోందని పేర్కొన్నారు. వ్యవసాయ రుణాలతోపాటు వ్యాపారపరమైన రుణాలు కూడా ఇప్పుడు అందుబాటులో ఉన్నాయని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ద్విచక్రవాహనాలు, కిరాణా షాపుల ఏర్పాటుకు కూడా రుణాలు ఇస్తామన్నారు. గ్రూపు రుణాలకు ఎక్కువగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇతర బ్యాంకుల కంటే తక్కువ వడ్డీ ఉంటుందని తెలిపారు. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

గృహ, వ్యవసాయ, బంగారంపై రుణాలు

ప్రజాశక్తి -ఆనందపురం : గృహ, వ్యవసాయ, బంగారు ఆభరణాలపై బ్యాంక్ ఆఫ్ బరోడాలో రుణాలు అందిస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ ఎస్.రామనాయుడు తెలిపారు. వేములవలసలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహ, వ్యవసాయ, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులో డిపాజిట్లు చేసిన ఖాతాదారులను అభినందించారు. ముందుగా బ్యాంకు వ్యవస్థాపకులు సయాజీరావ్ గైక్వాడ్ - 3 చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమములో జాయింట్ మేనేజర్ ధనంజయ, క్యాషియర్ కామేశ్వరరావు, ఖాతాదారులు మేక నాగేశ్వరరావు, నాయకులు కోరాడ రాంబాబు, వ్యాపారవేత్త చేన్న వెంకటేష్ పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం దిబ్బడిపాలెం గ్రామానికి చెందిన షిణగం సురేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సురేష్ కుటుంబానికి భీమిలి జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల ఆధ్వర్యాన ఆనందపురం మండలంలోని జనసేన నాయకులు రూ.20 వేలు ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర వస్తువులను అందించారు. కుటుంబానికి జనసేన అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కృష్ణయ్య, చందర్రావు, గోవింద్, మూర్తి వెంకటరావు, ప్రశాంత్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తి ప్రచారంపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి ప్రతిష్టాత్మకంగా రూపొందించిన మహాశక్తి కార్యక్రమ నిర్వహణపై ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో అవగాహన కల్పించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు తెలుగు మహిళా ప్రతినిధులకు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం తెలుగు మహిళా ప్రతినిధులతో మహాశక్తి కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించి చర్చించారు. వైసిపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదని విమర్శించారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లీలావతి, బోయి రమాదేవి, ఎస్.మంగాదేవి, వి.పోలమ్మ, రిక్క సత్య తదితరులు పాల్గొన్నారు.

శొంఠ్యాం పాఠశాలలో టీవీ ఏర్పాటు

ప్రజాశక్తి -ఆనందపురం : శొంఠ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 ఇంట్రాక్టివ్ ప్లాట్ ప్యానల్స్, ఒక స్మార్ట్ టీవీని ఏర్పాటుచేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన వీటిని పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బొద్దపు బంగార్రాజు ఆధ్వర్యాన పాఠశాలలో ఏర్పాటుచేశారు. స్థానిక సర్పంచ్ లెంక లావణ్య, రాంబాబు, ఎంపిటిసి మాజీ సభ్యులు కోరాడ వెంకటరమణారావు వాటిని పరిశీలించారు.

రోడ్డు పనులపై దృష్టి

ప్రజాశక్తి-మధురవాడ : రోడ్డు పనులపై దృష్టి సారించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. జివిఎంసి 8వ వార్డు పరిధిలోని ఎండాడ, రుషికొండ, మిదిలాపురి కాలనీ, రుషికొండ ఉడాకాలనీ తదితర ప్రాంతాలలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్థానికుల అవసరాలు, రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రణాళికా బద్ధంగా అవసరమైన చోట రోడ్ల పనులు చేపడతామన్నారు. ఎండాడ నుంచి రుషికొండ వరకు రోడ్డుకిరువైపులా బడ్డీలతో ఆక్రమించారని, వారికి ప్రత్యామ్నాయం చూపించి వాటిని తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎండాడ వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను సందర్శించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. వార్డులో పారిశుధ్య నిర్వహణ సరిగాలేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మదురవాడ వెళ్లేందుకు వీలుగా రుషికొండ ఎంకె-1 రోడ్డును 60 అడుగులుగా అభివృద్ధి చేయాలని, సాగరనగర్, ఎండాడ రోడ్డు, వార్డులోని రోడ్లు, కాలువలు, పార్కింగ్ ప్రదేశాలు, పార్కులు సరిగా లేవని, వాటిని నిర్మించాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ, ఆనందపురం : మారికవలస సబ్‌స్టేషన్ పరిధి 11 కెవి జెఎన్ఎన్‌యుఆర్ఎం ఫీడర్‌పై శుక్రవారం మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని డిఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. మారికవలస జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, పిపి -2 కాలనీ, పెట్రోల్ బంక్ ఏరియా, శారదానగర్ కాలనీ, తిమ్మాపురం రోడ్, ఓంకాన్ అపార్టుమెంట్, వైఎస్ఆర్ కాలనీ, గాయత్రీ విద్య హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆనందపురం : ఆనందపురం సబ్ స్టేషన్ పరిధిలో వెల్లంకి, బొడ్డపాలెం, గారిపేట తదితర గ్రామాలలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు

ప్రజాశక్తి -ఆనందపురం : విద్యార్థులు పాఠశాల పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఆనందపురం సిఐ రామచంద్రరావు సూచించారు. మండలంలోని వెల్లంకి సమీపంలో గల రవీంద్ర భారతి గ్లోబల్ పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ-2023 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిఐ రామచంద్రరావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు పుస్తకాల నుంచి సంపాదించే జ్ఞానాన్ని నిజజీవితంలో ఉపయోగించి, సంఘంలో మంచి వ్యక్తిగా గుర్తింపు పొందాలన్నారు. చరిత్రలో జరిగిన సంఘటనలను, ఆనాటి నాయకులును ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని సూచించారు. అనంతరం పాఠశాల నూతన కేబినేట్‌ను ఏర్పాటుచేసి పాఠశాల ఎస్‌పిఎల్, ఎఎస్‌పిఎల్, మెంబర్లకు బ్యాడ్జీలను తొడిగారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఎజిఎం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి నెహ్రూనగర్‌లో రూ.15.10 లక్షల జివిఎంసి నిధులతో నిర్మించనున్న కాలువ పనులకు వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యాన గురువారం వైసిపి తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, పిఐ బాలరాజు, హుస్సేన్, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

పనులను అడ్డుకునేందుకు ప్రయత్నం...

ఈ కాలనీలో ఇటీవల ప్రారంభించిన కాలువ పనులు పూర్తి చేయక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ముందుగా వాటిని పూర్తి చేసి తరువాతనే శంకుస్థాపన చేయాలని స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వార్డు కార్పొరేటర్ ముందస్తు సమాచారంతో అక్కడకు వచ్చిన ఆరిలోవ సిఐ, పోలీసులు సర్దిచెప్పడంతో స్థానికులు వెనుదిరిగారు.

ఓటరు జాబితాపై ఇంటింటా సర్వే

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓటరు జాబితా పునర్విభజనలో భాగంగా జులై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటా సర్వే చేపట్టనున్నట్లు స్థానిక ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. ఆర్‌డిఒ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా పరిశీలన నిమిత్తం ఇంటింటికి వెళ్లే బిఎల్‌ఒలతో పాటుగా రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా వెళ్లాలని సూచించారు. ఒకే కుటుంబంలోని వారికి వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు ఉంటే ఒకే కేంద్రంలో ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు. మృతి చెందిన వారి పేర్లు తొలగించాలని, అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహశాల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎన్నికల డిటి జె.భాస్కరరావు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, పట్టణ ప్రణాళిక విభాగం ఎసిపి డి.శ్రీనివాస్, అల్లిపిల్లి నరసింగరావు, ఎం.షణ్ముఖరావు (వైసిపి), కోరాడ రాజబాబు, గంటా నూకరాజు (టిడిపి), పంచకర్ల సందీప్, ఇఎన్ఎస్ చంద్రరావు (జనసేన), కదిరి జగన్నాథం (కాంగ్రెస్) పాల్గొన్నారు

'బయోమెడికల్ పరిశోధనకు ఉజ్వల భవిష్యత్తు'

ప్రజాశక్తి -మధురవాడ : వైద్యరంగంలో మానవాళికి ఉపయోగపడే ఆధునిక బయోమెడికల్ ఉత్పత్తులను తయారు చేయడానికి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంతో పాటు బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇసిఇ విభాగం పరిశోధకులు దృష్టి సారించాలని, వాటికి ఉజ్వల భవిష్యత్తు ఉందని వాషింగ్టన్ డిసికి చెందిన జార్జి వాషింగ్టన్ యూనివర్సిటీ పరిశోధకుడు డాక్టర్ కార్తిక్ బులుసు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఇంజినీరింగ్ పరిశోధకులు సైతం వైద్యరంగానికి అవసరమైన ఉపకరణాలను అందించవచ్చని తెలిపారు.

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, అంతర్ విభాగం పరిశోధనల అవసరం పెరుగుతోందని చెప్పారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు డాక్టర్ జె.సరోజిని, డాక్టర్ ఆర్.బానుపవన్ తదితరులు పాల్గొన్నారు.

'గంగవరం' దీక్షలకు ఆటో కార్మికుల సంఘీభావం

ప్రజాశక్తి-సీతమ్మధార : కనీస వేతనాలు అమలు చేయాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన దీక్షకు మద్దతుగా రైల్వే స్టేషన్ ఇన్‌గేట్ వద్ద ఆటో డ్రైవర్లు సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ, గంగవరం పోర్టులో కార్మిక చట్టాలు, కనీస వేతనాలు అమలుచేయడంలేదన్నారు. కార్మికులపై గంగవరం పోర్టు యాజమాన్యం కక్ష సాధింపు చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, సెంట్రల్ లేబర్ కమిషనర్లు గంగవరం పోర్టు యాజమాన్యంతో, స్థానిక కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాలో స్థానిక స్టాండ్ అధ్యక్షులు వై.వెంకట్, రావికృష్ణ, పి.కనకరాజు, జి.శ్రీను, ఎం.ఎ.ఖాన్, హెచ్.శేఖర్, చిన్నరెడ్డి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఆసుపత్రులు రిజిష్టర్ చేసుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్- 2002 ప్రకారం ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకోవాలని జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు రిజిష్టర్ చేసుకోకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి -గాజువాక : శంకర్ ఫౌండేషన్, ఎల్ అండ్ టి సహకారంతో గాజువాక జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎల్ అండ్ టి జాయింట్ జనరల్ మేనేజర్ కెవి.సుబ్బారావు ప్రారంభించి మాట్లాడారు. ఎల్ అండ్ టి సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా నాలుగు రోజుల పాటు 1769 విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అంధత్వాన్ని దూరం చేయడంలో శంకర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ హెడ్ శ్రీనివాసరావు, ఆర్‌కె.రావు, శంకర్ ఫౌండేషన్ డిజిఎం వి.రమేష్‌కుమార్, సీనియర్ మేనేజర్ ఎస్.అప్పలరాజు, ప్రధానోపాధ్యాయులు జనార్దన్ పాల్గొన్నారు.

48వ వార్డులో గ్రామసభ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 48వ వార్డు పరిధి ఇందిరానగర్ - 2, 3, 4కు సంబంధించిన సచివాలయం వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజుకు పలువురు తమ సమస్యలతో కూడిన వినతులను అందించారు. వాటిని కెకె.రాజు పరిశీలించి అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు పంపించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైవరికైనా ఏదైనా పథకం వర్తించకుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఈ గ్రామసభలో జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, 48వ వార్డు ఇన్‌ఛార్జి నీలి రవి, ఎపిడి పద్మావతి, ఎఇ అర్చన, 48వ వార్డు నాయకులు కర్రి రామారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నరేష్, హేమంత్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్‌టిఐ ద్వారా వివరాలు కోరుతూ వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : సమాచార హక్కు చట్టం ప్రకారం మండలంలోని వివిధ శాఖలు, విభాగాల అధికారులకు టిడిపి నాయకులు గురువారం వినతులు అందించారు. మండలంలో వివిధ రకాల పింఛన్లు ఎన్ని ఉన్నాయి? ఎన్ని రద్దు చేశారు?, హెచ్‌జి గ్రూపులు ఎన్ని ఉన్నవి? తదితర వివరాల నిమిత్తం ఎండిఒ పి.వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఇళ్ల స్థలాలు, భూ సమీకరణపై తహసీల్దార్ కోరాడ వేణు గోపాల్‌కు, ఇళ్ల నిర్మాణాలపై గృహ నిర్మాణ సంస్థ ఎఇ హస్సేన్‌కు, నాడు-నేడు, ఇతరత్రా వివరాలకోసం ఎంఇఒ శివరాణికి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డిఎఎస్.రాజు, జడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎస్.అప్పారావు, మాజీ సర్పంచ్ జి.పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే పర్మినెంట్.. వేతనాలు అరకొరే...

అదానీ గంగవరం పోర్టులో కార్మికుల దుస్థితి

ప్రజాశక్తి -గాజువాక

అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న నిర్వాసితులైన కార్మికులకు యాజమాన్యం కనీస వేతనాలు అమలు చేయడం లేదు. శ్రమకు తగ్గ ఫలితం లేదు. పేరుకే పర్మినెంట్ కార్మికులు కానీ వీరికి చెల్లిస్తున్న వేతనాలు కాంటాక్టు కార్మికుల జీతాల కంటే తక్కువగానే ఉన్నాయి. గంగవరం పోర్టు నిర్మాణం కోసం సముద్రాన్ని త్యాగం నిర్వాసితులయ్యారు. వీరికి నిర్వాసిత కోటాలో ఉద్యోగాలు ఇచ్చారు. జీతభత్యాలు మాత్రం దారుణంగా ఉన్నాయి. చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక అప్పుల పాలవుతున్నారు. ప్రతి ఏడాదీ ఇస్తున్న ఇంక్రిమెంట్లు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉండటంలేదు. ఉద్యోగంలో చేరినప్పుడు ఇచ్చిన రూ.3700 బేసిక్ నేటికీ కొనసాగుతోంది. గంగవరం పోర్టులో ఉద్యోగంలో చేరి 14 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ బేసిక్‌లో ఎలాంటి మార్పూ లేదు. చట్టపరమైన వేతనాలు జీతాలు చెల్లించడం లేదు. ఒకే యాజమాన్యం కింద ఉన్న గంగవరం పోర్టు అందులో పనిచేస్తున్న కార్మికులను మాత్రం జిపిఎస్ఎల్, ఎజిపిపిఎల్, జిపిఎల్ పేరుతో నియమించుకొని వేర్వేరుగా


నిరసన తెలుపుతున్న కార్మికులు (ఫైల్)

రూ.15 వేలు, రూ.18,600 జీతాలు చెల్లిస్తున్నారు. ఐదు సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు రూ.11 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. విశాఖ పోర్టులోను, స్టీల్‌ప్లాంట్ లోనూ పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్న వేతనాల్లో సగం కూడా గంగవరం పోర్టు యాజమాన్యం చెల్లించడం లేదు. షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారు. గంగవరం పోర్టు అనేది షాప్ కాదు. భారీ కార్గో హ్యాండ్లింగ్ చేస్తూ డాలర్లలో లావాదేవీలు చేస్తున్న పోర్టు. జీతాలు చెల్లిస్తామని జూన్ 8వ తేదీన చర్చలు జరిగాయి. జూన్ 24న మరో సారి చర్చలు జరిగాయి. 26వ తేదీన కూడా చర్చలు జరిగాయి. ఈ విధంగా చర్చలు జరగడమే తప్ప యాజమాన్యం నుంచి ఎటువంటి పురోగతి లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెరగకపోవడంతో కార్మికులు డ్యూటీ తర్వాత ఇంటికెళ్లి పార్ట్ టైంగా స్విగ్గిల, జమోటా తదితరాల్లో ఉద్యోగులు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. మరి కొంతమంది సముద్రపు వేట చేసుకుని జీవనం సాగిస్తున్నారు.

ఇప్పుడున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని కోరుతూ కార్మికులు ఆందోళన చేపట్టారు. మొత్తం 11 డిమాండ్లను నెరవేర్చేవరకూ ఆందోళన కొనసాగుతుందని కార్మికులు స్పష్టంచేస్తున్నారు. ఒకపక్క ఆర్థిక ఇబ్బందులు, మరోపక్క యాజమాన్యం వైఖరి కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోర్టు లోపల విపరీతమైన దుమ్ము దూళిలో పనిచేస్తున్న కార్మికులకు ఆరోగ్య సౌకర్యాలు కూడా కల్పించక ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో అర్హత కలిగిన కార్మికులు ఉన్నప్పటికీ స్కిల్డ్ ఉద్యోగాలు ఇవ్వడంలేదు.

తక్కువ వేతనాలతో ఇబ్బందులు

తక్కువ వేతనాలు చెల్లిస్తుండటంతో కుటుంబంతో జీవనానికి కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చాలీచాలని వేతనాలతో పిల్లలను చదివించు కోలేకపోతున్నారు. 14 సంవత్సరాల నుంచి జీతాలు బేసిక్‌లో మార్పులేదు.



వి.ఎల్లాజీ
గంగవరం

14 సంవత్సరాలుగా పెంచని జీతం

ఒకప్పుడు సముద్రాన్ని నమ్ముకుని జీవించేవారం. కుటుంబమంతా సంతోషంగా ఉండేవారిమి. పోర్టు వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. పోర్టులో ఉద్యోగం ఇచ్చినప్పటికీ 14 సంవత్సరాలుగా ఒక పైసా కూడా పెంచలేదు. ధరలు మాత్రం విపరీతంగా పెరిగాయి.



యాద అప్పారావు
గంగవరం

ధరలకనుగుణంగా జీతాలు పెంచాలి

పేరుకే పర్మినెంట్ ఉద్యోగాలు. జీతాలు మాత్రం కాంట్రాక్టు కార్మికుల కంటే తక్కువగా చెల్లిస్తున్నారు. ఉద్యోగంలో చేరినప్పుడు కేజీ బియ్యం రూ.10 ఉండేది. ఇప్పుడు రూ.60 అయింది. మిగిలిన నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలి.



నొల్లి తాతారావు
దిబ్బపాలెం

నత్తనడకన భూగర్భ పైపులైన్ పనులు

ప్రజాశక్తి -మూలగాడ : పారిశ్రామిక ప్రాంతంలో ప్రధాన రహదారిని భూగర్భ పైపులైను పనుల కోసం తవ్వేసి గత కొన్ని నెలలుగా వదిలేశారు. ఇండియన్ కోస్ట్ గార్డు ప్రధాన కార్యాలయం నుంచి జింక్ గేటు వరకు సుమారుగా రూ.9 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టారు. జివిఎంసి తాగు నీటి కోసం చేస్తున్న ఈ పనులను సదరు కాంట్రాక్టర్ సరిగా చేయకపోవడంతో రోడ్డును పలుమార్లు తవ్వుతూ మట్టిని అలానే విడిచిపెడుతుండటంతో పాదాచారులు, వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల తవ్విన ప్రాంతంలో మట్టిని మాత్రమే వేసి వదిలేస్తున్నారు. ఈ మట్టిపై ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో కార్మికులు, ఉద్యోగులతో ఈ ప్రాంతంలో విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. ఆ సమయంలో అత్యవసర వాహనాలకు కూడా దారి లేకుండా పోతోంది. ప్రజా సమస్యలన్నీ అధికారులకు ప్రజా ప్రతినిధులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం విడ్డూరంగా కనపడుతోంది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



గోతులు తవ్వి ఉన్న రోడ్డు

43వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న కెకె.రాజు, ఉషశ్రీ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డు పరిధి జగన్నాథపురం, శ్రీనివాసనగర్, దాడి రామూర్తి కల్యాణ మండపం ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉష్మశ్రీతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 42వ వార్డు కార్పొరేటర్ అల్లు లీలావతిశ్రీనివాసరావు, 45వ వార్డు అధ్యక్షులు పైడి రమణ, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, 43వ వార్డు నాయకులు జక్కంపూడి సత్యనారాయణ, బైర వెంకట్, పారుపల్లి రవి, ఎస్.కుమార్, ఖాదర్, సన్యాసరావు, చంద్రకళ, ప్రశాంత్, భాను మూర్తి, యశోధ, సీనియర్ నాయకులు బోగవల్లి గోవింద్, షేక్ బాబ్జీ, కె.చిన్నా, సమ్మెట్ల వెంకటేష్ పాల్గొన్నారు.

ఇమ్మిగ్రేషన్ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ, సీతమ్మధార : ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారు మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా ఇమ్మిగ్రేషన్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అంతర్జాతీయ న్యాయ నిపుణుడు కావేటి శ్రీనివాసరావు సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యాన గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇమ్మిగ్రేషన్ చట్టాలపై ఆయన ప్రసంగించారు. అమెరికా వంటి దేశాలలో విద్య, ఉపాధి కోసం మధ్యవర్తులు, కొందరు ట్రావెల్ ఏజంట్లు సూచించే తప్పుడు మార్గాలను అనుసరించడం వల్ల పలువురు భారతీయులు ఇబ్బందులలో చిక్కుకుంటున్నారని చెప్పారు. గల్ఫ్ దేశాలలో ఉద్యోగాల పేరిట జరుగుతున్న మోసాలు అధికంగానే ఉన్నాయన్నారు.సరైన పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లే అక్రమ వలసలుగా పరిగణిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అనితారావు పాల్గొన్నారు.

సీతమ్మధార : విదేశీ విద్య, వీసాలు పేరిట మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని కావేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. సీతమ్మధారలోని ఎన్‌బిఎం లా కళాశాలలో ఇంటర్నేషనల్, ఇమ్మిగ్రేషన్ లా అంశంపై ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాలకు చెందిన నకిలీ వీసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సదరు సంస్థ గుర్తింపు, జాబ్ ఆఫర్ లెటర్ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నైజీరియా, ఆఫ్రికా దేశాలకు చెందిన సైబర్ నేరగాళ్లు రూ.5 లక్షలు నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు ఇస్తున్నారని, వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో ప్రిన్సిపల్ డివి.రమణ పాల్గొన్నారు.

సమస్యలపై వీఆర్ఏల ధర్నాలు


అనకాపల్లి ధర్నాలో మాట్లాడుతున్న శంకరరావు


అచ్యుతాపురంలో...


కె.కోటపాడులో..

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు డిమాండ్ చేశారు. అనకాపల్లి తహశీల్దారు కార్యాలయం వద్ద గురువారం ఆంధ్ర ప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, డిఏను వేతనం నుండి మినహాయించటాన్ని విరమించుకోవాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందరిని విఆర్ఏలుగా నియమించాలని డిమాండ్ చేశారు. విఆర్ఎల ఆందోళనకు రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వై.శ్రీరామ్మూర్తి, సిఐటియు నాయకులు, గంటా శ్రీరామ్, జి.సత్యనారాయణ, సంతోష్, దాకారపు శ్రీనివాసరావు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో విఆర్ఎలు తోటాడ సింహాచలం, కొత్తపల్లి నాగేశ్వరరావు, ఎస్కెఆర్ బాషా, జి.సూర్యారావు, జి.రాధిక, ఎస్.పద్మ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొడ్డు శ్రీను పెదప్పారావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం విఆర్ఎలు ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. సంఘం



మునగపాకలో...

మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.బొజ్జులు, జి.ముత్యాలు మాట్లాడుతూ వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత, పెన్షన్ హెల్త్ కార్డులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, చింతా అప్పారావు, శ్రీను, ఉల్లి పాపమ్మ, ఉల్లి దేవుడమ్మ, రాజులమ్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గ్రామ సేవకులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గాలి పరదేశి నాయుడు శివలంక కృష్ణ, తట్టా శ్రీను, రవికుమార్, బాబురావు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం వీఆర్ఏల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలను దీర్ఘకాలికంగా పరిష్కరించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో లంబ సన్యాసిరావు, ఈశ్వరరావు, పి చిన్న, రాజు, చంద్రకళ, సన్యాసమ్మ, రమణ, పలివెల్ల రాము, పద్మా పాల్గొన్నారు.

కె.కోటపాడు : పొరుగున ఉన్న తెలంగాణలో వీఆర్ఏలను రెగ్యులర్ చేసినట్లే మన రాష్ట్రంలో కూడా క్రమబద్ధీకరించాలని అనకాపల్లి జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షులు కుంచెల రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎన్.పోలీస్, కెళ్ళ అంజి, పి.దండు, కోటి, కోన అప్పారావు, ఎన్.మల్లేష్, ఎం.ప్రసాద్, గాలి అప్పలనరస, పెందుర్తి సింహాచలమ్మ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట విఆర్ఎలు నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకట అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎన్.గంగాధరరావు, బి.సంతోష్, ఆరిపాక నర్సింగరావు, బాతు శంకర్ పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం విఆర్ఎలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. డిఏను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన విఆర్ఎలు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ తహశీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు ధర్నా చేశారు. సంఘం జిల్లా కోశాధికారి ఎం సంతోష్ కుమార్ మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రావాడ శంకర్, శేఖర్, వై.బాబురావు, రాము, అప్పలనరసమ్మ, సన్యాసిరావు, రాజు పాల్గొన్నారు.

గొలుగొండ : తమ సమస్యల పరిస్కారానికి మండల పరిషత్ కార్యాలయం వద్ద విఎఒలు సంఘం ప్రెసిడెంట్ వి.రమణ సెక్రెటరీ జి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పే స్కేల్ అమలు చేయాలని, 60 ఏళ్లుదాటిన విఆర్ఎల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కోటవురట్ల :తమ న్యాయమైన కోరికలు తీర్చాలంటూ గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు నిరసన చేపట్టారు. వేతనాలు పెంపు, రెండేళ్ల పెండింగ్ డిఎ చెల్లింపు, అర్హులకు విఆర్ఒలుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు తహశీల్దార్ జానకమ్మకు వినతిపత్రం అందజేశారు.

కొత్తకోట: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మండలంలోని విఆర్ఎలు గురువారం రావికమతం తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించకుంటే దశలవారీ ఆందోళన ఉధృతం చేస్తామని విఆర్ఎల సంఘం మండల అధ్యక్షుడు నక్కా అప్పారావు, కార్యదర్శి మొసా రామకృష్ణ హెచ్చరించారు.


పరవాడలో...



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు

చెరుకు రైతుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ షుగర్ రైతుల బకాయిలను చెల్లించి, 9.5 రికవరీపై టన్నుకు రూ.5వేలు చెల్లించాలని, చెరుకు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎపి చెరుకు రైతుల సంఘం ఆధ్వర్యాన గురువారం మండలంలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎండి వి సన్యాసినాయుడుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చెరుకు రైతులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ క్రషింగ్ ముగించి నాలుగు నెలలు కావస్తున్నా ఇంకా పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. మన రాష్ట్రంలో ఏ ఫ్యాక్టరీలోను 9.5 శాతం రికవరీకి మించి రాలేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో మంచి వంగడాలను ప్రభుత్వం రైతులకు సరఫరా చేయడం వలన 13, 14 శాతం రికవరీ రావడంతో రైతులకు గిట్టుబాటు అవుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రోత్సాహకం కింద టన్నుకు 400 రూపాయలు చెల్లించాలన్నారు. స్వామినాథన్ ఒకటి సిఫార్సుల మేరకు పెట్టుబడిపై 50శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి క్రషింగు సామర్థ్యం పెంచే విధంగా నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గండి నాయన బాబు, బోనీ దేవుళ్ళు, వెంకట అప్పారావు, నరసింహనాయుడు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం పనితీరుపై ఎంపిపి అసహనం

ప్రజాశక్తి-అనకాపల్లి : చిన్నారులకు, గర్భిణులు, బాలింతల కోసం ఏర్పాటుచేసిన అంగన్వాడీ కేంద్రాల పనితీరు సక్రమంగా మార్చుకోవాలని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు సూచించారు. మండలంలోని తుమ్మపాల సచివాలయ -1 పరిధిలోగల అంగన్వాడి సెంటర్ 5ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెను సక్రమంగా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులన్నీ తప్పుతడకలు చూసి సంబంధిత అధికారులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీడిపిఓ శశికళ, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన సిగ్గుచేటు

ప్రజాశక్తి-చోడవరం : మణిపూర్ రాష్ట్రంలోని ఇద్దరు మహిళలపై జరిగిన అత్యంత దుర్మార్గమైన సంఘటన దేశానికే తలంపు తెచ్చేలా ఉందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ చోడవరం శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై లోవరాజు, కళ్యాణ అన్నారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాటత్లాడుతూ మహిళలను వివస్త్రులను చేసి, ఊరేగించి, ఆ పిదప మానభంగం చేసినట్లుగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన, కఠోర కర్కశమైన ఘటనను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. విశ్వ గురువులమని ప్రగల్భాలు పలికే పెద్దలు ఏం చేస్తున్నట్లు అని వారు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తగు రీతిలో స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి సూర్యప్రభ, జి వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : సులభ పద్ధతులు పాటించడం ద్వారా ప్రకృతి వ్యవసాయంలో అధిక లాభాలు ఆర్జించవచ్చునని ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు పేర్కొన్నారు. మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు రాపేటి రామారావు, కాండ్రేగుల మహాలక్ష్మి నాయుడు, రాపేటి అప్పారావు పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ 30 రకాల విత్తనాలు భూమిలో వేయటం వలన కలిగే లాభాలను వివరించారు. పిఎండిఎస్ విత్తనాలు భూమిలో కలిపి దున్నడం వలన రైతులకు ఎటువంటి యూరియా గానీ డిఏపి ఎరువులు గాని వాడవలసిన పని లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కాశీలోవ, వెంకటలక్ష్మి, మువ్వల అప్పారావు పాల్గొన్నారు.

జిఎస్టికి వ్యతిరేకంగా ఎల్ఐసి ఏజెంట్లు నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

బీమా పాలసీలపై జీఎస్టీకి వ్యతిరేకంగా స్థానిక యల్ఐసి కార్యాలయం ఎదుట బీమా ఏజెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగస్తులు, ఖాతా దారులు కరణం మాణిక్యరావు, వెన్నెల సన్యాసిరావు, ఐతా రాము, అప్పలనాయుడు, దుంగల రాజేశ్వరి, వానపల్లి కన్నారావు,శివ అప్పారావు, తీర్రు చిరంజీవి, కొణతాల నూక అప్పారావు మాట్లాడుతూ కస్టమర్స్ కి బోనస్ రేట్లు పెంచాలని, ఏజెంట్ల ప్రొఫెషనల్ టాక్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేట్ ఫీజు మీద జీఎస్టి అమలు చేయడం దారుణమన్నారు. డైరెక్ట్ మార్కెటింగ్ ని నిలుపుదల చేయాలని, గ్రాట్యుటీని పెంచాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ని పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొండా నూకరాజు, పీలా శివ అప్పారావు పాల్గొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కన్నయ్య శాస్త్రి, రమేష్, రంగబాబు, ఆడారి శ్రీను తదితరులు సంఘీభావం ప్రకటించారు.

చోడవరం : ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలతోపాటు, కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి పట్ల అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఎల్ఐసి ఏజెంట్లు గురువారం చోడవరం ఎల్ఐసి కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్ల సంఘం (సిఐటియు) అధ్యక్షుడు ఎం నాగరాజు మాట్లాడుతూ ఎల్ఐసి లావాదేవీలు పై జిఎస్టి రద్దు చేయాలన్నారు. పాలసీలకు బోనస్ పెంచాలని, బీమా సుగమును ఎల్ఐసిలో ప్రవేశ పెట్టవద్దని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్ గ్రాడ్యుటి పెంచాలన్నారు. ఎల్ఐసిని ప్రైవేటుపరం చేయకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి శంకర్రావు, కోశాధికారి శ్రీనివాసరావు, సూర్యనారాయణ, ఈశ్వరరావు, రామకోటి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

ఘనంగా బోకం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని తవ్వవానిపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. శ్రీనివాస్ సోదరుడు, గ్రామ సర్పంచ్ బోకం స్వామినాయుడు అధ్యక్షతన ఎమ్మెల్యే ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా రాష్ట్ర వైసీపీ కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు పాల్గొని కేక్ కట్ చేసి బోకం శ్రీనివాస్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శ్రీనివాస్ పుట్టినరోజును పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో వివిధ ఆలయాల నిర్మాణాలకు రూ.3 లక్షలు విరాళాలు అందజేశారు. గ్రామంలో 100 కుటుంబాలకు 25 కేజీల బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. గ్రామంలోని యువకులకు క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీలు చొక్కాకుల గోవింద, శరగడం ఝాన్సీలక్ష్మీరాణి రాము, వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కోటాన రాము, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, మాజీ సర్పంచ్ బోకం అప్పల నాయుడు, ఉప సర్పంచ్ వనం దేముడుబాబు ,బోకం కాసుబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


పేదలకు బియ్యం అందజేస్తున్న దృశ్యం

స్మైలెక్స్ కంపెనీలో విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

23 లక్షలు పరిహారం చెల్లింపునకు యాజమాన్యం అంగీకారం

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ పరిశ్రమలో బుధవారం కరెంట్ షాక్‌తో ఒక కార్మికుడు మృతి చెందారు. అనకాపల్లి మండలం తగరంపూడి ఈ గ్రామానికి చెందిన నాగులపల్లి సంతోష్ అలియాస్ నాగేష్ (24) స్మైలెక్స్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నారు. బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో దుర్మరణం చెందారు. దీంతో మృతుని కుటుంబీకులు, సిఐటియు నాయకులు, తగరంపూడి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. దీంతో యాజమాన్యం చర్చలు జరిపింది. గురువారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో చర్చలు ముగిశాయి. మృతుని కుటుంబానికి రూ.23 లక్షల పరిహారం, రూ.50వేలు దహన ఖర్చులు చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించింది. ఈ సందర్భంగా ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా యాజమాన్యం కార్మికులతో పనులు చేస్తుందని, దీనివల్లనే కార్మికులు పిట్టల రాలిపోతున్నారని తెలిపారు. యాజమాన్యంపై ప్రభుత్వం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, అధ్యక్షులు ఆర్ శంకరరావు, తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, బొద్దపువానిపాలెం సర్పంచ్ బద్దపు శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ పాల్గొన్నారు.



పోలీసుల సమక్షంలో కంచె వేస్తున్న దృశ్యం

లచ్చన్న నుయ్యి చుట్టూ కంచె

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట గ్రామ శివారు నేతవానిపాలెం గ్రామంలో లచ్చన్న నుయ్యి చుట్టూ సరిహద్దులకు పోలీసుల ఆధ్వర్యంలో హద్దులు కేటాయించి పోల్స్‌ను పాతారు. స్థానిక వైస్ ఎంపిపి గొంప వెంకటేశ్వరరాజు గత ఆదివారం అర్ధరాత్రి సమయంలో బావిని మట్టితో కప్పించి వేశాడు. దీంతో నేతవానిపాలెం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, బత్తుల తాతయ్య బాబుల ఆధ్వర్యంలో ర్యాలీగా మండల కార్యాలయం వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. నుయ్యి ని పునరుద్ధరించాలని ఎంపిడీవోకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కలసి సమస్యను విన్నవించారు. ఈ నేపధ్యంలో బుధవారం మరోసారి ధర్మశ్రీని నేతవానిపాలెం గ్రామస్తులు కలసి తమ సమస్యను విన్నవించారు. ఎమ్మెల్యే కరణం ధర్మ శ్రీ ఆదేశాల మేరకు కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాజ్ మహమ్మద్ ఆధ్వర్యంలో బుచ్చయ్యపేట ఎస్సై కుమారస్వామి సిబ్బంది ఆధ్వర్యంలో, రెవెన్యూ అధికారులు పంచాయతీ సిబ్బంది నుయ్యి ఈ చుట్టూ సరిహద్దులను పాతారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో అచ్యుతాపురం, తిమ్మరాజుపేట, ఎం జగన్నాధపురం గ్రామాలలో గురువారం గ్రామదేవతల పండగలు ఘనంగా జరిగాయి. అచ్యుతాపురం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగ, తిమ్మరాజుపేట గ్రామంలో దుర్గాంబిక అమ్మవారి పండగ, ఎం జగన్నాధపురం గ్రామంలో గుర్రప్ప అమ్మవారి పండగ చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయంలో పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అచ్యుతాపురం గ్రామ సర్పంచ్ కె విమలా నాయుడు, తిమ్మరాజుపేట గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాబు నాయుడు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఎల్ఇడి బల్బుల వితరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు పదివేల రూపాయలు విలువచేసే ఎల్ఈడి బల్బులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను వితరణ చేశారు. ఈ సామగ్రిని గురువారం స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ కెవిఎల్ఎన్ నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ కు శ్రీను అందజేశారు. చైర్మన్ ఉదారతను డిసిఓ రూపావతి తో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ తో పాటు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామని, ఇంకా పథకాలు పొందని అర్హులైన వారికి అందించాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష పథకం చేపట్టారని వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్‌లో వైసిపి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగనన్న సురక్ష ప్రారంభించి రెండు వారాల్లోనే 10,700 సచివాలయాల పరిధిలో 27 లక్షల ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 24 లక్షల ఆదాయ ధ్రువ పత్రాలు, 3,159 ఓబిసి సర్టిఫికెట్లు, 5,199 ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు అందించామని తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, కసింకోట జడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, కలగా గున్నయ్య నాయుడు, రత్నకుమారి, బొడ్డేడ శివ పాల్గొన్నారు.

మోడరన్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో మోడరన్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ పట్ల అవగాహన పెంచుకోవాలని బమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్ మేనేజర్ పిఎస్ ఎస్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాల లో మోడరన్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్‌పై గురువారం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎస్ ఎస్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎన్. రాము మాట్లాడారు. అనంతరం వెంకటేశ్వర్లును స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ హేమంత్ ఆధ్వర్యాన సాలువాతో సన్మానించారు.

కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలి

ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి

కౌలు రైతులందరికీ జగనన్న సురక్షలో సిసిఆర్సి కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయంలో గురువారం జరిగిన కౌలు రైతు సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఈక్రాప్ నమోదు చేసి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. వ్యవసాయంలో నూటికి 60 నుంచి 70 మంది కౌలు రైతులే ఉన్నారని, వీరికి సిసిఆర్సి కార్డులు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. జగన్మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత 2011 చట్టానికి సవరణ చేసి తయారు చేసిన 2019 చట్టమే కౌలు రైతులను ఆత్మహత్యలకు గురి చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని సవరించి భూ యజమాని ఆమోదంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ సిసిఆర్సి కార్డులు ఇచ్చి ఇన్పుట్ సబ్సిడీలు, పంట నష్ట పరిహారాలు, నిజమైన సాగుదారులకుఉన్న కౌలు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. వ్యవసాయ రంగం నుండి రైతాంగాన్ని దూరం చేసి కార్పొరేట్ కంపెనీలకు భూములను కారు చౌకగా కట్టబెట్టే కుట్ర చేసిందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు ఏ ఒక్క ప్రయోజనం నెరవేర్చడం లేదన్నారు. జూలై 25వ తేదీన మునగపాక గ్రామంలో జరిగే జిల్లా రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

దేవాదాయ భూముల కౌలుదారులకు గుర్తింపు కార్డులకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : దేవాదాయ భూముల సాగుదారులకు కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఏపి కౌలు రైతుల సంఘం, రైతు స్వరాజ్య వేదిక సంఘాలు నాయకులు ఎ.బాలకృష్ణ, గాడి బాబు సంయుక్తంగా దేవాదాయ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పర్యావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా వ్యవసాయం లాభసాటిగా లేక పెట్టుబడులు పెరిగి అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే దుర్భర పరిస్థితుల్లో కౌలు రైతులు ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై దేవాదాయ ధర్మాదాయ శాఖ అదనపు కమిషనర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కవిత అగ్రిఫాం ఆరోపణలు అవాస్తవం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న



మీడియా సమావేశంలో ఆధారాలు చూపుతున్న వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి : సిపిఎంపై శ్రీకవిత అగ్రి ఫాం యాజమాన్యం చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న స్పష్టం చేశారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకవిత అగ్రి ఫారం యజమాని డివి.అప్పారావు చేసిన ఆరోపణలు ప్రజలను తప్పుతోవ పట్టించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. డివి అప్పారావుపై సిపిఎం ఇప్పటి వరకు ఎప్పుడు వ్యక్తిగత దూషణలకు పోలేదని, ఆయన చేసిన భూములు కొనుగోలులో అన్ని అక్రమాలే జరిగాయని పేర్కొన్నారు. ఈ భూములు దేవదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటే అది ప్రభుత్వానికి, దేవదాయశాఖకు ఉపయోగపడుతుందని, సిపిఎంకు ఎటువంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. సామాజిక స్పృహ, స్ఫూర్తితో సిపిఎం ప్రభుత్వ భూముల రక్షణ కోసం పోరాటం చేస్తుందని తెలిపారు. మారేపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 115లో కోట్లాది రూపాయలు విలువ చేసే 23 ఎకరాల 15 సెంట్లు భూమి ముమ్మాటికి దేవుని మాన్యమేనని, పక్కాగా రికార్డులు ఉన్నాయని తెలిపారు. ఇకనైనా ప్రజలను తప్పుతోవ పట్టించే ప్రకటనలు మానుకొని స్వచ్ఛందంగా భూములు దేవాదాయశాఖకు అప్పగించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట డిపిఎన్ ఉన్నత పాఠశాల బదిలీపై వెళ్ళిన ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీధర్ రెడ్డి , ఇతర ఉపాధ్యాయులు దేవానంద్, సుబ్బరాజు, మోహన్‌రావులకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి.అప్పారావు, స్థానిక నాయకులు మళ్ళ బుల్లిబాబు, వైస్ ఎంపిపి లక్ష్మి, ఉపాధ్యాయులు ప్రభాకర్, జయరాం ప్రసాద్, నాగేశ్వరరావు, శర్మ, అప్పారావు, రామారావు, పి.డి ప్రభాకర్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఓటరు వెరిఫికేషన్‌పై దృష్టి

ప్రజాశక్తి -కశింకోట : గ్రామాల్లో ఓటర్ వెరిఫికేషన్ సందర్భంలో టిడిపి కార్యకర్తలు వాటిపై దృష్టి పెట్టి పరిశీలించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో గురువారం ఓటర్ పరిశీలన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ నాయకులు తప్పుడు తడకలు చేయిస్తారని, జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయల మురళీ, వేగి గోపికృష్ణ, గొంతుని శ్రీనివాసరావు, నైనంశెట్టి రమణరావు, కర్రి దుర్గానాయుడు జెర్రిపోతుల నూకి నాయుడు, ఆనాల తాతియ్య నాయుడు, ఉల్లింగల రమేష్ పాల్గొన్నారు

కశింకోట అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వైయస్సార్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లి బాబు అన్నారు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో సుమారు 1300 ఇళ్ల నిర్మాణం చేసినట్లు చెప్పారు. నాలుగు సచివాలయం భవనం నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. 2008 సర్పంచ్‌గా పనిచేసి శారదా నది ఒడ్డున ఒకే సారి మూడు మృతదేహాలకు అంతిక్రియలు జరిగేలా పనులు చేశామని చెప్పారు. జగనన్న కాలనీ నాలుగు చోట్ల సుమారు 600 గృహనిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు.

అనకాపల్లి నియోజకవర్గం మరింత అభివృద్ధి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గం మరింత అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. మండలంలోని చింతనిప్పుల అగ్రహారం గ్రామంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో గురువారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గ్రామంలో కాలువలు, రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు మంత్రి అమర్నాథ్ ప్రకటించారు. అనకాపల్లి నియోజకవర్గాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే కార్యాచరణ ప్రారంభమైందని, త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. చెరుకు రైతుల సమస్యలను పరిష్కరించి, వారికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లిమల్ల గోవింద, ఎంపీటీసీ సభ్యుడు, వైసిపి నాయకులు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పెదనాయుడు పాలెం గణపతిపురం గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి తవ్వవాని పాలెం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ తరఫున వారి సోదరుడు సర్పంచ్ బోకం స్వామి నాయుడు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, ఉపసర్పంచ్ మండల లక్ష్మణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి కతజ్ఞతలు తెలిపారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

ప్రజాశక్తి-కశింకోట : విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి కృషి చేయాలని ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి అన్నారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో కెప్టెన్, వైస్ కెప్టెన్ నియామకం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటలు పాటలు కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ పాల్గొన్నారు

టమాటా, మిర్చి, అల్లం ధరలను నియంత్రించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : గత నెల రోజుల నుంచి టమాటా, మిర్చి, అల్లం ధరలు మండిపోతున్నాయని, వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ధ రాజేష్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ వీటి ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ప్రతిపక్షాలు కూడా ప్రకటనలకే పరిమితం అవుతున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత సమస్యల మీద మాట్లాడేకంటే నిత్యావసర వస్తువులపై మాట్లాడాలని కోరారు.

ఓటర్ల ధ్రువీకరణ సర్వేకు సహకారం



రాజకీయ నేతలతో మాట్లాడుతున్న ఇఆర్‌ఒ రామలక్ష్మి

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈ నెల 21వ తేదీ నుండి గ్రామాల్లో జరగనున్న ఓటరు జాబితాల ధ్రువీకరణ సర్వేకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని పాయకరావుపేట నియోజకవర్గ ఎలక్టోరోల్ రిటర్నింగ్ అధికారిణి కెవి.రామలక్ష్మి కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశంలో మాట్లాడారు .బూత్ లెవెల్ అధికారులు ఈనెల 21వ తేదీ నుండి ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా ప్రకారం ఓటర్లను ధ్రువీకరించి నమోదు చేస్తారన్నారు.కొత్త ఓటర్లు చేర్పు, మరణించిన ఓటర్ల తొలగింపు ,ఓటర్లు ధ్రువీకరణపై జరుగు ప్రక్రియలో రాజకీయ నేతలు సహకరించాలని కోరారు సమావేశంలో తహశీల్దార్లు అంబేద్కర్, జయప్రకాశ్, ఇఒపిఆర్‌డి వెంకట నారాయణ, పలు పార్టీల నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, శీరం నర్సింహమూర్తి, కొణతాల శ్రీనివాసరావు, బి నాగేశ్వరరావు, ఎం సత్యనారాయణ , బంగార్రాజు, ఈశ్వరరావు, పాపారావు, పోలనాటి నానాజీ, కె.అప్పలరాజు పాల్గొన్నారు.

భక్తునికి సన్మానం

ప్రజాశక్తి- కె.కోటపాడు : స్థానిక శ్రీశిరిడి సాయిబాబా ఆలయం నిర్మించి నేటికీ పుష్కరకాలం పూర్తయిన సందర్భంగా సాయి భక్తులు గొర్లి సన్యాసినాయుడికి ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఘన సన్మానం చేశారు. జనసేన పార్టీ నాయకులు ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేగి రామారావు, గిలకం శెట్టి సత్యారావు, కుంచా అంజిబాబు, జి.అప్పలనాయుడు, యాళ్ల సాయి, యలమంచిలి ధర్మారావు, బండారు గడ్డి బాబు పాల్గొన్నారు.

అడ్డంగా తూము నిర్మాణంపై ఫిర్యాదు



పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రోలుగుంట :మండలంలో కంచుగుమ్మల రెవెన్యూ పరిధిలో చింతలబంద చెరువుకు నీరు వచ్చే ఫీడర్ ఛానల్‌కు అడ్డంగా తూములు నిర్మించిన చిటికెల వెంకటసత్యనారాయణ అనే రైతుపై ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై గురువారం సాయంత్రం ఇరిగేషన్ ఎఇ బండారు సత్యనారాయణ, ఆర్ఐ రామ్మూర్తి సందర్శించి ఫీడర్ ఛానల్‌కు మధ్యలో తూము ఏర్పాటుతో చెరువుకు నీరు పోదని, దీంతో ఆయకట్టుకు నష్టం వాటిల్లుతుందన్నారు. సైడ్‌వాల్ నిర్మాణం కూడా సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు బండారు శ్రీనివాసరావు, సుర్ల నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ ఫీడర్ చానల్ ద్వారా చితలబంద, బండారుబంద, ముక్కిబంద, బొందలబంద సుమారు 100 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని,అడ్డంగా తూమునిర్మించడం వల్ల నష్టం వాటిల్లుతుందని, నిర్మించిన తూము, సైడు వాల్ తొలగించాలని కోరారు.

ఉన్నత పాఠశాలకు రహదారి సౌకర్యం

ప్రజాశక్తి-మాడుగుల : మండలంలోని ఎం కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సిసి రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి..ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ శాఖ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు గొల్లవిల్లి రాజేష్, పాఠశాల కమిటీ చైర్మన్ కోన అన్నపూర్ణ పాల్గొన్నారు

కల్వర్టు పనుల్లో జాప్యంతో కష్టాలు

◆ ప్రధానరోడ్డులో అరకొరగా తొలగించి వదిలేసిన కాంట్రాక్టరు

◆ ఆందోళన చెందుతున్న వాహనదారులు, ప్రయాణికులు



పునర్నిర్మాణానికి సగం తవ్వేసి వదిలేసిన కల్వర్టు

ప్రజాశక్తి-రోలుగుంట : చోడవరం నుండి కొత్తకోట మీదుగా రోలుగుంట, వెలంకాయలపాలెం గ్రామం వరకు గల బిఎన్ రోడ్డు వెడల్పు చేస్తున్నారు. దీనిలో భాగంగా రోలుగుంట మండల పరిధిలో కొత్తకోట గజాల కట్ట నుంచి వెలంకాయలపాలెం గ్రామం వరకు శిధిలావస్థలో ఉన్న ఎనిమిది కల్వర్టులు నిర్మాణానికి జేసిబితో రోడ్డు సగం భాగం తొలగించారు. ఉన్న ఒక్కరోడ్డులో యుద్ధప్రాతి పదికన పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టరు నెల రోజులు కావస్తున్నా పట్టించుకోలేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం ఈ రోడ్డుపై బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలు కాకుండా గ్రానైట్ వాహనాలు హెవీలోడుతో తిరుగుతుంటాయి. ప్రధాన మార్గంలో సగం వరకు తొలగించి పనులు చేపట్టని కల్వర్టుల వద్ద ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి కల్వర్టుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

వీడని వానలోనూ గడపగడపకూ..



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : జోరు వానలోనూ మున్సిపాలిటీ పరిధిలో గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పాల్గొన్నారు. గురువారం 11వ వార్డులో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి స్వయంగా నమోదు చేసుకున్నారు. మౌలిక సౌకర్యాలు, సమస్యలపై అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో రూ.50కోట్లతో అదనపు పడకలను, చిన్నపిల్లలకు సైతంఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామని, ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ రాక కోసం, సమస్యలు చెప్పుకోవడం కోసం, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సుబ్బలక్ష్మి,వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, జగనన్న సచివాలయల కన్వీనర్ తమరాన శ్రీను, వార్డు కౌన్సిలర్ బేతి రెడ్డి రత్నం, వార్డ్ ఇన్‌ఛార్జి బేతి రెడ్డి విజయ్, వైసిపి నేతలు చీటిల రాము, గుడివాడ సన్యాసి నాయుడు, శాలివాహన కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ అర్జున, ముస్లిం సంచార జాతుల స్టేట్ డైరెక్టర్ చోటి , అయ్యర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, కో ఆప్షన్ సభ్యులు షేక్ రోజా, ఎండి భాషా వైసిపి మహిళ విభాగం టౌన్ అధ్యక్షురాలు గంటా లలిత,కొణతాల వరలక్ష్మి, కనితి అన్నపూర్ణ, దేవత అరుణ, దనిమిరెడ్డి ప్రసాద్, టౌన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏకాశివ, యాదగిరి శేషు, పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పేరుతో ప్రజలను పక్కదారి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : రోడ్ల విస్తరణ పేరుతో ప్రజలను నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పక్కదారి పట్టిస్తున్నారని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉంటే విస్తరణ పనులను ఎలా ప్రారంభిస్తారని జన సేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీర సూర్యచంద్ర ప్రశ్నించారు. శుక్రవారం నుంచి రోడ్ల విస్తరణ పనులు ప్రారంభిస్తామని ప్రకటన రావడంతో స్పందించిన జనసేన నాయకులు వివిధ అంశాలపై గురువారం నర్సీపట్నం ఆర్‌డిఒ జయరామ్‌కు, మున్సిపల్ కమిషనర్ కనకరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ నర్సీపట్నం ప్రధాన రోడ్డు విస్తరణ ఎంతో అవసరమని, దీనికి జనసేన తరపున పూర్తి మద్దతు ఉంటుందన్నారు. అయితే రోడ్డు విస్తరణ అంశంకోర్టు పరిధిలో ఉండగా ఎలా చేస్తారని ప్రశ్నించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాకుండా భవనాలను కూల్చేస్తే కొత్త సమస్యలు ఉత్పన్నమౌతాయన్నారు. రోడ్డును ఆనుకుని ఉన్న డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు.

జలజీవన్ మిషన్ పథకంలో రూ.166 కోట్లతో ఇంటింటికి కుళాయిల ఏర్పాటుకు రోడ్లను తవ్వేసి పైపులు వేసిన కాంట్రాక్టర్, బిల్లులు చెల్లించక పారిపోయాడన్నారు. రోడ్డు విస్తరణ విషయంలో తన పంతం నెగ్గించుకోవడానికి ఎమ్మెల్యే దూకుడు ప్రదర్శిస్తున్నారని, దీని వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవన్నారు. వెంకటేశ్వరస్వామి గుడి నుండి కొత్తవీధి మీదుగా పెదబొడ్డేపల్లి వరకు రోడ్డు విస్తరణను ఎందుకు చేపట్టలేదో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మారిశెట్టి రాజా, కర్రి సంతోష్, వాసం వెంకటేష్, బంగారు నాయుడు, పోలుపర్తి సూరిబాబు, వేగిశెట్టి శ్రీనివాస్, మాకిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ : అభాగ్యులు, నిరుపేదలకు తోచిన సహాయం అందించడమే తమ లక్ష్యమని స్నేహాంజలి ఫర్ పూర్ సభ్యులు తెలిపారు. గురువారంగొలుగొండ, జోగంపేట గ్రామాల్లో 50 నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.500 విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేసారు. సంస్థ ప్రతినిధి చిట్టియ్య, సభ్యులు ఈశ్వరరావు, భాను, బోగేష్, ప్రసాద్, నల్లయ్య వాలంటీర్ వీరబాబు, శివ పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న స్నేహాంజలి సంస్థ సభ్యులు

ఆసుపత్రిలో కిట్లు లేక జరగని పరీక్షలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రిలో అన్ని శస్త్ర చికిత్సలకు ముందుగా వైద్య పరీక్షలు చేసే సిబిసి, హెచ్బిఎ 1సి, థైరాయిడ్, హెచ్ఐవి కిట్లు లేకపోవడంతో హాస్పటల్లో ఆ పరీక్షలు జరగడంలేదని సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దీనిపై ఆసుపత్రి కలెక్టరుకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. ఆసుపత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ ఏర్పాటు చేయాలని ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదన్నారు. పార్టీ నాయకులు తాకాసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరుబిల్లి శంకర్రావు పాల్గొన్నారు.

ఎత్తేసిన హాస్టల్‌ను గ్రంథాలయంగా మార్చాలి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలో ఎత్తివేసిన హాస్టళ్లను అంబేద్కర్ గ్రంథాలయంగా మార్చాలని దళిత సంఘం ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రంలో స్థానిక అబీద్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక సభ్యులు మాట్లాడుతూ దళితులకు ఆపేసిన సంక్షేమ పథకాలను కొనసాగించాలని, సబ్‌ప్లాన్ నిధులతో దళిత వాడల్లో మౌలిక సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై శనివారం ఉదయం 10 గంటలకు జిల్లాలో దళిత సంఘాల ముఖ్య నాయుకులతో సమావేశం ఏర్పాటు చేసామన్నారు. మణిపూర్‌లో దళిత మహిళపై జరిగిన అఘాయిత్యాన్ని తీవ్రంగా ఖండించారు. డివిజన్ అద్యక్షులు చిట్ల చలపతి, డివిఎంసి సభ్యులు ఎం అప్పలరాజు, మాల మహానాడు అధ్యక్షులు జి సహదేవుడు, దళిత నాయకుడు యాదగిరి దాసు కార్యక్రమ నిర్వాహకులుగా, ఆహ్వాన సంఘంగా వ్యవహరిస్తారన్నారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు

గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు



తనిఖీ చేస్తున్న డైరెక్టర్ శ్రీనివాసులు, అధికారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఎపి ఫారెస్ట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ నైనార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫారెస్ట్ గోదాములను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొడౌన్‌లలో స్టాక్ వేసిన కాఫీ గింజలను, మిరియాల నిల్వలను పరిశీలించారు. మిషనరీ పనితీరును, గోదాం సామర్థ్యానికి తగ్గట్టుగా ఉందాయనిఅడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమస్యలపై ఆరా తీశారు. గోదాంతోపాటు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ భవాని మంగతాయారు, చింతపల్లి డివిజన్ మేనేజర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

సిహెచ్‌సిలో జనరిక్ మందుల దుకాణం

ప్రజాశక్తి -కోటవురట్ల : కోటవురట్ల సిహెచ్‌సిలో జనరిక్ మందులు షాపు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి తెలిపారు. గురువారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో నూతనంగా నిర్మించిన షాపును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 10 జనరిక్ మందుల షాపులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు, జనరిక్ మందుల వాడకంలో ఎటువంటి అపోహలు అవసరం లేదని అన్ని వర్గాల ప్రజలకు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెటర్నరీ మందులు కూడా అందుబాటులో ఉంచనన్నట్లు తెలిపారు, మండలంలో రాజుపేట గ్రామంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించామని, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుతో రైతులు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రాంబాబు, ఎపిఎం రమణకుమారి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్ర అనుమతికి వినతి



ఎఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో కొత్త పైపులైన్ సమస్యను అనకాపల్లి జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లేందుకు చేపట్టనున్న పాదయాత్రకు అనుమతి ఇప్పించాలని పలువురు మత్స్యకారులు కోరారు. గురువారం నర్సీపట్నంలో ఎఎస్‌పి ఆదిరాజ్ రాణాను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఎపి మత్స్యకార జెఎసి రాష్ట్ర కన్వీనర్ పిక్కి స్వామి తెలిపారు. కంపెనీ వ్యర్ధ జలాలు సముద్రం, ఉప్పుటేరులోకి వదలడం వలన మత్స్యసంపద నశించి పోతుందని, దీనివలన తాము ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. హెటిరో కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా తామంతా 590 శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో కలెక్టర్ ను కలవడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ నెల 31న సోమవారం కలెక్టరేట్ స్పందనలో విన్నవించేందుకు 30న ధర్నా శిబిరం నుంచి పాదయాత్రకు వెళ్లేందుకు పర్మిషన్ ఇప్పించాలని ఎఎస్‌పిని కోరారు. పర్మిషన్ కోసం చలానా చెల్లించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పిక్కి తాతీలు, మత్స్యకార నాయకులు యజ్జల నాగరాజు, పిక్కి కోటి, గొర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు .

ప్రశ్నార్థకంగా ఖరీఫ్ వరిసాగు

▸▸ ఆకాశానికేసి చూస్తున్న అన్నదాతలు

▸▸ అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో చేరని సాగునీరు





రోలుగుంటలో కనీస స్థాయిలోనైనా సాగునీరు చేరనిచెరువులు ... ఆలస్యంగా వేసిన విత్తనాలతో ఏపుగా పెరగని వరినారు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌వరిసాగు ప్రశ్నార్ధకంగా మారింది. మండలంలో వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నా చెరువుల్లో నీరు చేరలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంట గ్యారంటీ లేదని ఆందోళన చెందుతున్నారు. మండలంలో 24 పంచాయతీలు 64 గ్రామాలు ఉన్నాయి. మండలంలో మెరక, పల్లం, బంజరు చెరువులు. మొత్తం విస్తీర్ణం 33వేల హెక్టార్లు. 24 పంచాయతీలలో 152 చెరువులు ఉన్నాయి. వాటిలో 10 చెరువులు చిన్న నీటిపారుదల శాఖకు చెందినవి. వీటికి నీటి సంఘాలు ఉన్నాయి. 100 ఎకరాలు మాత్రం రావికమతం మండలం కల్యాణపులోవ రిజర్వాయర్‌పై ఆధారపడి ఉంది. మిగతా అంతా వర్షాధారంపై ఆధారపడింది. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు వరినారుమడులు వేశారు. అయితే ప్రస్తుతం ఆశించిన వర్షాలు కురవకపోవడంతో చెరువులు, పొలాల్లో నీరు చేరక, నాట్లు వేయడం ప్రశ్నార్ధకంగా మారింది.

గత ఏడాది ఇదే జులై 20 నాటికి దమ్ములు ప్రారంభించారు. ఈ ఏడాది కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ నారుమడులు వేస్తున్నారు. గతంలో మండలంలో సుమారు 12వేల ఎకరాల్లో చెరకు పండించేవారు. ఈ ఏడాది కనీసం వంద ఎకరాల్లో కూడా చెరకు పంట వేయని దుస్థితి ఉంది. సుమారు 25వేల టన్నులు చెరకు మండల రైతులు చోడవరం సుగర్ ఫ్యాక్టరీకి తరలించేవారు. తొలకరి పంటలైన నువ్వు, సామలు, గంట్లు వేసేవారు ఈ ఏడాది ఆ పంటలు పత్తాలేదు.

14వ రోజుకు రిలే దీక్షలు



మోకాళ్లపై నిరసన వ్యక్తం చేసున్న గిరిజనులు

ప్రజాశక్తి -కోటవురట్ల: అణుకు గ్రామానికి రహదారి పాఠశాల నిర్మాణం చేపట్టాలంటూ గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మోకాళ్లపై నిరసన చేపట్టారు పాఠశాల. రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజనులు శిబిరం వద్ద నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా మండల సిపిఎం జిల్లా నాయకులు అప్పలరాజు మాట్లాడుతూ తమ న్యాయమైన కోరికలు తీర్చే వరకు దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. మండల సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

చోద్యం పిఎసిఎస్‌లో రూ.2 కోట్ల వార్షిక టర్నోవర్



సొసైటీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని చోద్యం పిఎసిఎస్‌లో గత ఆర్ధిక సంవత్సరంలో రూ. రెండు కోట్ల టర్నోవర్ జరిగినట్టు పిఎసిఎస్ అధ్యక్షుడు కిలపర్తి పెద్దిరాజు తెలిపారు. గత మార్చి నాటికి రెండు కోట్ల టర్నోవర్ పూర్తిస్థాయి రుణ రికవరీ జరిగిందని, తద్వారా సొసైటీకి రూ.18 లక్షలు వడ్డీల రూపంలో ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఏడాది మరో రూ. కోటి రైతులకు స్వల్పకాలిక రుణాలుగా అందించేందుకు ప్రతిపాదనలు పెట్టామన్నారు. రుణాల అవసరమైన రైతులు భూమి పట్టా పాస్ బుక్‌తో బ్యాంకును సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం సెక్రటరీగా పనిచేస్తున్న రాజు పదవీకాలం గత నెల 30తో ముగిసిందని, ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు మరో రెండేళ్లు సర్వీస్ పొడిగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సొసైటి అధ్యక్షుడు పెద్దిరాజు, డైరెక్టర్లు కసరరాజు, బాబురావు, గండేం అచ్చియమ్మలను సిబ్బంది సన్మానించారు.

గబ్బాడ ఇసుక డిపో వద్ద ఆందోళన

డబ్బులు చెల్లించినా ఇసుక కోసం తిప్పలు

ఆవేదన చెందుతున్న జగనన్న ఇళ్ల లబ్ధిదారులు



ఆందోళన చేస్తున్న జగనన్న ఇళ్ల లబ్ధిదారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మండలంలో గబ్బాడ ఇసుక రీచ్ వద్ద ఇసుక కోసం గురువారం లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఇసుక కోసం అకౌంట్ నుంచి డబ్బులు కట్ చేసినప్పటికీ, ఇసుక లేదనడంపై ఆందోళనకు దిగారు. నర్సీపట్నం కేంద్రంగా నడుస్తున్న డిపో నుంచి ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారుల నుంచి టన్నుకు రూ. 875 వసూలు చేస్తున్నారని, అయితే రెండు నెలలుగా లబ్ధిదారులు డిపో చుట్టూ తిరుగుతున్నా ఇసుక ఇవ్వడం లేదని మండిపడ్డారు. గురువారం నుంచి ఇసుక డిపో మూసివేస్తున్నట్లు సమాచారం తెలియడంతో కోటవురట్ల, నాతవరం, మాకవరపాలెం, రొలుగుంట, గొలుగొండ నర్సీపట్నం ఏడు మండలాలు, నర్సీపట్నం మున్సిపాలిటీ నుంచి జగన్న ఇళ్ల లబ్ధిదారులు అధిక సంఖ్యలో డిపో వద్దకు చేరుకుని ఆందోళన చేశారు.

ఆలయానికి లాకర్ బహూకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక లక్ష్మిదేవిపేట శ్రీసీతా రామాలయానికి కమిటీ అభ్యర్ధన మేరకు కొణతాల రేవతిరావు తన సొంత నిధులతో తల్లి తండ్రుల జ్ఞాపకార్ధం లాకర్‌ను ఆలయానికి బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొలమరసెట్టి వరాహ సత్యనారాయణ, ఆలయ కార్యదర్శి కొణతాల సాయిరాం ప్రసాద్, కోశాధికారి రాపేటి సాంబశివ, కమిటీ సభ్యులు కొణతాల కుమార్ మాస్టర్, కొణతాల నాయుడు, ఆడారి బాబ్జీ, రాపేటి ఈశ్వర రావు, బొద్దేటి వెంకటేశ్వర రావు, దొడ్డి శంకర్ పాల్గొన్నారు.

బిఒబి బహుముఖ కార్యక్రమాలు

ఘనంగా బ్యాంకు ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవం





వాక్‌థాన్‌లో పాల్గొన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగులు

బిఒబి వార్షికోత్సవ సంబరాల్లో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాలను గురువారం విశాఖలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆర్కే బీచ్‌లోని కాళీమాత టెంపుల్ నుంచి వైఎంసిఎ వరకూ వాక్‌థాన్ చేపట్టారు. దీనికి ముఖ్య అతిథిగా జివిఎంసి అదనపు కమిషనర్ సన్యాసిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను అగ్రభాగాన నిలిపేందుకు బిఒబి సహకరిస్తోందని తెలిపారు. బ్యాంక్ ఆఫ్ బరోడా అసిస్టెంట్ జనరల్ మేనేజర్, విశాఖపట్నం రీజినల్ మేనేజర్ పిఎం ప్రధాన్ మాట్లాడుతూ తమ బ్యాంకు దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించిందని, ఎల్లవేళలా వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ 115 సంవత్సరాలు పూర్తి చేసుకుందని అన్నారు. ఈ ప్రస్థానంలో సహకరించిన వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు. సుందర విశాఖ నగరంలో ఎకో వైజాగ్ పేరుతో నిర్వహిస్తున్న క్యాంపెయిన్‌లో భాగస్వాములు కావటం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం సిరిపురంలోని వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో వ్యవస్థాపక దినోత్సవ సంబరాలను చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ అండ్ ఎమ్‌డి పృధ్వీరాజ్, జూనియర్ చెస్ ఛాంపియన్ కోలగట్ల అలన మీనాక్షి, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

పవన్ ముఖ్యమంత్రి కావాలి

ప్రజాశక్తి- మాడుగుల : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఆ పార్టీ నేత రాయపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఘాట్‌రోడ్ జంక్షన్లో చండీయాగం నిర్వహించారు రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో పవన్ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. జనాల్లోనూ జనసేనకు ఆదరణ పెరిగిందన్నారు. నాలుగు మండలాల జనసేన నేతలు పాల్గొన్నారు.

బాధ్యతల సక్రమ నిర్వహణే నాయకత్వ లక్షణం



ప్రకాష్ విద్యాసంస్థలో ఎన్నికైన స్టూడెంట్ యూనియన్ నేతలు

ప్రజాశక్తి-పాయకరావుపేట : విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటే భావితరం నేతలుగా నిలుస్తారని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ అన్నారు. గురువారం శ్రీ ప్రకాష్ పాఠశాలలో స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థి దశలో బాధ్యతాయుతంగా ఉంటే, భవిష్యత్‌లో మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. రేపటి తరానికి కావలసిన నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశలోనే నేర్చుకుని అద్భుత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపల్ అపర్ణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనోసా విద్యాసంస్థల్లో...



కనోసా విద్యాసంస్థల్లో సీక్రెట్ ఓటేస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట : బాధ్యతల సక్రమ నిర్వహణే నాయకత్వ లక్షణమని కనోసా ఇంగ్లీష్ మీడియం విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సిస్టర్ సంతాన అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థి సంఘాల ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్ హౌస్ కెప్టెన్‌లను క్రీడలు, గ్రూప్ డిస్కషన్, రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ తదితర అంశాల ఆధారంగా ఎంపిక చేశారు. అనంతరం వారి వారి ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో గౌరవ వందనం స్వీకరించి, నాయకత్వ బాధ్యతలు సక్రమంగా నిర్వహించేలా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిల్లో, పిఇటి శ్రీను సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు